క్లుప్తంగా

ముమ్మరంగా సచివాలయ నిర్మాణ పనులు



కోసిగి: మండలంలోని సజ్జలగుడ్డంలో చేపడుతున్నట్లు గ్రామసచివాయ భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని 19 సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సచివాలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.43.50 లక్షలు కేటాయించింది. ఇది వరకు దుద్ది, కోసిగి-4,కోసిగి-5, పెద్దభూంపల్లి గ్రామాల్లో పూర్తి కాగా మిగిలినవి ముమ్మరంగా పనులు సాగుతున్నాయి.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తమాలజిస్ట్ ఎస్.జి.సింహావీరన్న

కోసిగి: మండలంలోని మూగల దొడ్డి గ్రామంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సహకారంతో కర్నూలు అమీలియో హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆదివారం గ్రామ మారెమ్మవ్వ దేవి ఆలయ ప్రాంగణంలో సర్పంచ్ శివలింగమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు సోమేష్ సమక్షంలో ఆప్తమాలజిస్ట్ ఎస్.జి. సింహావీరన్న కంటి వైద్య పరీక్షలు చేశారు. దాదాపు 120 మంది వరకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఇందులో 20 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం కర్నూలుకు రెఫర్ చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ చేయించుకునే వారికి నవంబర్ 6వ తేదీన గ్రామం నుంచి ప్రత్యేకంగా ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

బోరు ఏర్పాటు



చిన్నతుంబళం ముస్లిం శ్మశాన వాటికలో బోరు వేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండలంలోని చిన్నతుంబళం గ్రామంలోని ముస్లింల కబరస్తాన్‌లో ఆదివారం బోరు వేశారు. గ్రామంలో గత నెలలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శ్మశాన వాటికలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ముస్లింలు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులతో వైస్ ఎంపీపీ ముత్తమ్మ, గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప ఆధ్వర్యంలో బోరు వేయించారు. దీంతో ముస్లింలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పీఎస్ మూర్తి ఆశయాలను సాధిద్దాం



పీఎస్ మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్/ఆదోని అర్బన్: విశ్రాంత అధ్యాపకుడు పీఎస్ మూర్తి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడవాలని వివేకానంద సేవా సమితి సభ్యులు ప్రకాశ్, రామయ్య, నిరంజన్, నల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పీస్ మూర్తి కుమారుడు శ్రీకాంత్ అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ 40 సంవత్సరాల పాటు పేద విద్యార్థులను చదివించారని, నేడు వారు ప్రస్తుతం ఎంతో మంది ఉద్యోగాలు పొంది వివిధ హోదాల్లో ఉన్నారని చెప్పారు. ఈరన్న, దేవమ్మ,రత్నప్రభ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి అమానుషం



డిపో ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆదోనిటౌన్ : కావలిలో ఆటోనగర్ డిపోకు చెందిన డ్రైవర్ రామ్‌సింగ్‌పై జరిగిన దాడి అమానుషమని ఆదోని ఆర్టీసీ డిపో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.కుమార్, చీఫ్ అడ్వైజర్‌లు రంగస్వామి, లక్ష్మన్న అన్నారు. విధి నిర్వహణలో ఉన్న డ్రైవర్‌పై బస్సులో నుంచి లాగి చితకబాదడం దుర్మార్గమన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట దాడికి నిరసనగా నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు పీపీ రాముడు, గోవిందు, శివుడు, శంకర్‌దాదా, ఉద్యోగులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాన్ని వెలికి తీసేందుకు..

- వచ్చే ఏడాది ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షల నిర్వహణ
- విద్యార్థులను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు
- ముందుగా సీస్ పరీక్ష నిర్వహించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- వచ్చే నెల 3న నిర్వహణ



ఆదోనిలో విద్యార్థుల చేత ప్రాక్టీస్ చేయిస్తున్న ఉపాధ్యాయుడు,



విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయుడు

ఆదోని సెంట్రల్: విద్యార్థుల్లో దాగి ఉన్న అభ్యాసన సామర్థ్యాలను తెలుసుకునేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) పేరుతో ఎన్‌సీఈఆర్‌టీ పరీక్షలు నిర్వహిస్తుంది. ప్రతి మూడు సంవత్సరాలకొకసారి నాస్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇంతకు ముందు 2021లో పరీక్ష నిర్వహించగా వచ్చే ఏడాది టెస్ట్ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పరీక్షలకు విద్యార్థులను ఉపాధ్యాయులు సిద్ధం చేస్తున్నారు. కాగా నాస్ టెస్టుకు ముందుగా స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ (సీస్) టెస్ట్ మండల స్థాయిలో చేపట్టనున్నారు. ఈ టెస్టు వచ్చేనెల 3వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఇందుకు ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రాక్టీస్ పరీక్షలు నిర్వహిస్తూ సిద్ధం చేస్తున్నారు. గతంలో నాస్ పరీక్షలు 3,5,8 తరగతులకు నిర్వహించేవారు. ఈ ఏడాది 3,6,9 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తారు. ఎన్‌సీఈఆర్‌టీ ఎంపిక చేసిన పాఠశాలల్లో మాత్రమే ఓఎంఆర్ విధానంలో పరీక్షలు ఉంటాయి.

పరీక్ష విధానం..

తరగతుల వారీగా విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను సాధించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు నూతన సంస్కరణలను తీసుకొస్తున్నాయి.అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతి సిలబస్‌ను, 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతి సిలబస్, 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్‌పై పరీక్షలు నిర్వహిస్తారు. 3,6 తరగతులకు లాంగ్వేజ్, గణితం ఈవీఎస్ సబ్జెక్టుల్లో 40 ప్రశ్నలు 60 నిమిషాల్లో, 9వ తరగతి విద్యార్థులకు లాంగ్వేజ్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో 60 ప్రశ్నలు 90 నిమిషాల్లో రాయాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవడానికి వీలుంటుంది.

ప్రాక్టీస్ చేయిస్తున్నాం



పాఠశాలలో 6,9 తరగతి విద్యార్థులతో ప్రాక్టీస్ చేయిస్తున్నాం. ముఖ్యంగా లాంగ్వేజ్‌తో పాటు గణితం, సైన్సు సబ్జెక్టుల్లో తర్ఫీదు ఇస్తున్నాం. 6,9 తరగతుల నుంచి 30 మంది విద్యార్థుల పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధిస్తున్నారు. ఇలాంటి పరీక్షలను నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను తెలుసుకోవచ్చు. – కె. మల్లికార్జున, ప్రధానోపాధ్యాయుడు, పురపాలక ఉన్నత పాఠశాల, ఆదోని

ప్రతి పాఠశాల నుంచి పాల్గొనాలి



నవంబర్ 3న జరిగే స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ (సీస్) టెస్టుకు ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనాలి. 3,6,9 తరగతుల నుంచి 30 మంది చొప్పున విద్యార్థులు పాల్గొనాలని హెచ్ఎంలకు సూచించాం. ఇప్పటికే చాల పాఠశాలల్లో సీస్ పరీక్షలకు విద్యార్థులతో ప్రాక్టీస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయిలో అభ్యాసకుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించే నాస్ పరీక్ష విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. – బి. శివరాములు, ఎంఈఓ

వారాబందీని ఒప్పుకోం



నిరసన తెలుపుతున్న రైతులతో మాట్లాడుతున్న డీఈ, ఏఈ

కౌతాళం: తుంగభద్ర దిగువ కాలువకు వారాబందీని ఎలా విధిస్తారని రైతులు ఆదివారం కాలువపై నిరసన తెలిపారు. పార్టీలకతీతంగా వందలాది మంది తరలివచ్చి నిరసనలో పాల్గొన్నారు. అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆదివారం ఉదయం మండలంలోని కౌతాళం మేజర్, టు-ఎల్, మాదవరం మేజర్, 74, 75 డిస్ట్రిబ్యూటర్ కాలువలకు నీరు నిలిపి వేసి దిగువకు తీసుకెళ్లాలని నిర్ణయించడంతో రైతులు ఒక్కసారిగా ఆదోని రోడ్డులోని తుంగభద్ర ప్రధాన కాలువపై నిరసనకు దిగారు. కాలువ మీదుగా వెళ్తున్న డీఈ మహమ్మద్ షఫీవుల్లా వాహనాన్ని అడ్డుకున్నారు. రాత్రి 7గంటలైనా చర్చలు జరిగే వరకు అడ్డుతొలగలేదు. డీఓ, ఏఈలు ఉసేన్‌పీరా, ఈశ్వర్, ఎస్ నరేంద్ర కుమార్‌రెడ్డి కాలువ వద్దకు వచ్చి రైతులతో మధ్యహ్నాం నుంచి చర్చించినా ససేమిర అంటూ నిరసన కొనసాగించారు. మూడు రోజుల పాటు సాగు నీరు దిగువకు తరలిస్తే మా పంట పొలాలు ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.వారాబందీ అమలు చేయకుండా తమ వాటా నీరు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో ఉన్నతాధికారులతో మాట్లాడి సోమవారం సాయంత్రం వరకు మాత్రమే వారబందీ అమలు చేసేందుకు అధికారులు ఒప్పుకోవడంతో రైతులు నిరసన విరమించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఏకాంబర్‌రెడ్డి, సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ సక్రి తిక్కయ్య పలువురు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం, నాటుసారా స్వాధీనం



నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆదోనిరూరల్ : పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉరుకుందమ్మ అనే మహిళ వద్ద ఐదు కర్ణాటక మద్యం బాక్సులను గుర్తించి మద్యం స్వాధీనం చేసుకొని ఆమెను అరెస్టు చేశామని సెబ్ పోలీసులు ఆదివారం తెలిపారు. అలాగే..భాస్కర్‌రెడ్డి కాలనీ వద్ద ఆదోని పట్టణానికి చెందిన బోయ నరసింహులు, ప్రవంతి 12 ఓసీ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యం బాక్సులు, ఈరన్న అనే వ్యక్తి వద్ద ఒక కర్ణాటక మద్యం బాక్స్ కలిగి ఉండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. సెబ్ సీఐ హరికృష్ణ, , ఇన్‌స్పె ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి ఆదోని పట్టణంలోని బాలనాగన్న చెరువు వద్ద దాడులు నిర్వహించగా బోయ శివ నాటుసారా బట్టీని నిర్వహిస్తున్నట్లు గుర్తించి 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అక్కడికి సమీపంలోనే బయ చిరంజీవి బట్టీని గుర్తించి 400 లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేసి, ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామని వివరించారు.

విశ్రాంత సైనికుల సమస్యలను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న రత్నరూత్

ఆదోనిఅర్బన్ : విశ్రాంత సైనికుల సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా సైనిక అధికారిణి శ్రీమతి రత్నరూత్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆదోని డివిజనల్ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విశ్రాంత సైనికుల కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. విశ్రాంత సైనికులు, అలాగే భర్త మరణానంతరం వితంతువులకు ప్రభుత్వం ద్వారా రావాల్సిన బకాయిలు ఎలా పొందాలో వివరించారు. అలాగే సైనికుల పిల్లలు ప్రధానమంత్రి ఎడ్యుకేషనల్ స్కాలర్‌షిప్ ఎలా పొందాలో అవగాహన కల్పించారు. అనంతరం పాత గుర్తింపు కార్డులు ఉన్నవారికి కొత్త కార్డులు అందజేశారు. కార్యదర్శి నాగరాజు, గపాల్, సీఆర్ స్వామి, విశ్రాంత సైనికులు పాల్గొన్నారు.



పొలాల్లో పంటలను తినేస్తున్న జింకలు

రైతులకు జింకల బెడద

మద్దికెర: అసలే వానలు రాక ఇబ్బందులు పడుతున్న రైతులకు జింకలు పెద్ద సమస్యగా తయారవ్వడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి ఒట్టి నేలలో విత్తనం వేసి వర్షం కోసం ఎదురు చూస్తున్నామని కొద్దిపాటి మొలిచిన పంటలను జింకలు తినేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి జింకలను పట్టుకుని పార్కులకు తరలించి రైతులను కాపాడాలని కోరుతున్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఉత్తమ జీవనానికి మార్గదర్శి భగవద్గీత



జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ దేవతా మూర్తులకు హారతి ఇస్తున్న పురోహితులు

కర్నూలు కల్చరల్: ఉత్తమ జీవనానికి భగవద్గీత మార్గదర్శిగా నిలుస్తుందని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవన విధానం అలవడుతుందన్నారు. జీవితంలో ఉత్పన్నమయ్యే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. నైతిక విలువలు నేర్పించాలన్నారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. అనంతరం శీల ప్రభు పాదుల ప్రేమ విందు జరిగింది. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం





ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బోయగేరికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు

ఆదోనిటౌన్ : 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం కావడం తథ్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయని చెప్పారు. ఆదివారం పట్టణంలోని 6వ వార్డు బోయగేరికి చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు వంద కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బోయగేరికి చెందిన పెద్ద ఆంజనేయులు ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులను ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల నాటికి టీడీపీ, జనసేన పార్టీలు ఖాళీ అవుతాయన్నారు. అభివృద్ధి, ప్రజాదరణ చూసి ఓర్వలేకనే ఆయా పార్టీల నాయకులు బురదజల్లుతున్నారని మండిపడ్డారు. మేలు చేసే నాయకుడు ఎవరో ప్రజలకు తెలుసునని, అబద్ధాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామని యువకులు, పెద్దలు ఆంజనేయులు, రామన్న, ఉరుకుందు, భీమన్న, విక్కీ, అంజి తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధితుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

పట్టణంలోని గోకారిజెండా వీధికి చెందిన షేక్‌మహ్మద్ రజాక్ కొన్ని నెలలుగా బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా పక్షవాతం వచ్చింది. ఆదోని, కర్నూలులో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా నయం కాలేదు. విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సునార్ అబ్దుల్ ఖాదర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మహ్మద్‌రజాక్ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే స్పందించి సీఎం సహాయ నిధి కింద కర్నూలులోని కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. రూ.4 లక్షలు ఖర్చు అయ్యిందని బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద బాధితుడికి రూ.4 లక్షలు మంజూరు చేయించి ఆదివారం బాధితుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు.

ఫీజు చెల్లింపునకు రేపు ఆఖరు

కౌతాళం: ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు వచ్చే ఏడాది (2024) పబ్లిక్ పరీక్షలు రాయడానికి ఈనెల 31వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల చివరి వరకు అవకాశం కల్పించిందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఉరుకుందలో బహిరంగ వేలాలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం, అలాగే దేవాలయానికి సంబంధించిన పాత కార్యాలయాన్ని పడగొట్టేందుకు సోమవారం బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, పాలక మండల చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ తలనీలాలు పోగు చేసుకొనేందుకు ఏడాది పాటు హక్కు ఉంటుందని, అలాగే దేవాలయ ఆవరణ మధ్యలో ఉండి భక్తులకు ఇబ్బందిగా మారిన పాత కార్యాలయ భవనాన్ని పడగొట్టేందుకు వేలం పాటలను నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి కల్గిన వారు వేలం పాటల్లో పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గ్రహణ శాంతి హోమం

ఆదోనిఅర్బన్: పట్టణ శివారు మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో గ్రహణ శాంతి హోమం పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో చంద్రగ్రహణ దోష నివారణార్థం వేద పండితులు హోమం చేపట్టారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున రెండున్నర గంటల వరకు హోమం చేశారు.

రేపు ఆదోనిలో ప్రజా రక్షణ భేరి యాత్ర

కర్నూలు(సెంట్రల్): అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఆదోనిలో ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను సోమవారం ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ తెలిపారు. ఆదివారం ఆయన కర్నూలు నగరంలో పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. బస్సు యాత్ర సాయంత్రానికి కర్నూలుకు చేరుకుంటుందన్నారు.ఇక్కడ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఉన్న బహిరంగ ప్రదేశంలో సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని టీజీకే ఆర్‌కేడీ పాఠశాలలో ఆదివారం రాత్రి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2003-2004 సంవత్సరంలో కలిసి చదువుకున్న వారందరు కలుసుకున్నారు. 19 ఏళ్ల తరవాత కలుసుకోవడంతో ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ.. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తాము చదివిన పాఠశాలలో కలియదిరిగారు. కార్యక్రమం నిర్వహిణకు కృషి చేసిన సాయికిరణ్, దివ్య,కీర్తి, నాగలక్ష్మిని అభినందించారు.

తీరిన రహదారి కష్టాలు



నాడు: గుంతలమయంగా ఉన్న రోడ్డు



నేడు: రామదుర్గం గ్రామానికి నూతనంగా వేసిన రోడ్డు

చిప్పగిరి: ఎన్నో ఏళ్ల నెలకొన్న రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలూరు-గుంతకల్లు ప్రధాన రహదారి నుంచి మండలంలోని రామదుర్గం గ్రామానికి వెళ్లే రోడ్డు గతంలో గుంతలమయంగా ఉండడంతో ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేయడంతో గ్రామానికి రహదారి కష్టాలు తీరాయి. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి రోడ్డు సమస్యను గ్రామ ప్రజలు తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో 1.50 కి.మీ మేర రూ.20 లక్షల ప్రభుత్వ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేయడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్ల సమస్య పరిష్కారం



యాటకల్లులో సీసీ రోడ్డు నిర్మాణానికి చదును చేస్తున్న దృశ్యం

ఆస్పరి: మండలంలోని యాటకల్లు గ్రామంలోని ప్రధాన వీధి గుంతలు పడి అధ్వానంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అంతేగాకుండా కైరుప్పల, కలపరి, కారుమంచి గ్రామాలకు వెళ్లాలంటే యాటకల్లు ప్రధాన వీధి గుండా వెళ్లాల్సి ఉండేది. దీంతో ఆయా గ్రామాల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షం పడితే గుంతల్లో ఆటోలు, స్కూటర్లు వెళ్లేందుకు అవస్థలు వర్ణణాతీతం. గ్రామస్తులు సమస్యను గత టీడీపీ ప్రభుత్వంలో అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి యాటకల్లుకు వచ్చిన కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి సర్పంచ్ సుధమ్మ, గ్రామస్తులు సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సచివాలయం నిధులు రూ.20 లక్షలను కింద డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణానికి మంజూరు చేశారు. దీంతో పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ ఆదివారం తెలిపారు. సమస్య పరిష్కారమవుతుండడంతో సర్పంచ్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన పెంచండి

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన పెంచాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమ కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ డీపీడీ మాట్లాడుతూ... వ్యవసాయంలో విత్తనశుద్ధికి ఎంతో ప్రాధాన్యత ఉందని, విత్తనం ద్వారా వ్యాపించే చీడపీడలను సమర్థవంతంగా నివారించుకోవచ్చని చెప్పారు. చాల మంది రైతులు విత్తనశుద్ధి చేసుకోకుండానే విత్తనాలు విత్తుకుంటారని, దీంతో పంటలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని పేర్కొన్నారు. విత్తనాలను శిలీంద్ర నాశినితో శుద్ధిచేసి, విత్తనం వేయుటకు ముందు జీవ శిలీంద్ర నాశినితో విత్తనశుద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతుల్లోకి తీసుకెళ్లాలని ఇన్‌పుట్ డీలర్లను కోరారు. దేశీ డిప్లొమ కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ... నిల్వ చేసిన ధాన్యంలో ఆశించు పురుగులు, వాటిని నియంత్రించు పద్ధతులను వివరించారు. ధాన్యం నిల్వ చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పురుగుల వల్ల 20-25 శాతం వరకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు ప్రతి అవసరానికి ముందు సంప్రదించేది ఇన్‌పుట్ డీలర్లనేనని, వారికి చక్కటి సలహాలు ఇచ్చి సహకరించాలని పేర్కొన్నారు.